క్లుప్తంగా

పీహెచ్‌సీకి డస్ట్‌బిన్ల వితరణ



పీహెచ్‌సీకి అందజేసిన డస్ట్‌బిన్లు, చీపుళ్లు

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కోరుకొండ మండలం గుమ్మల్లదొడ్డిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డస్ట్‌బిన్లు, చీపుళ్లు వితరణ చేసింది. ప్రధాన మంత్రి ప్రారంభించిన స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా వీటిని అందజేసినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఐఓసీఎల్‌కి చెందిన అధికారులు మిథున్ కుమార్, వెంకటేష్, ప్రిన్స్ కుమార్ సింగ్, పీహెచ్‌సీ సీహెచ్‌వో వెంకటరత్నం, ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు పాల్గొన్నారు

వ్యవసాయ గణనపై శిక్షణ



మాట్లాడుతున్న తహసీల్దార్ పాల్‌బాబు

సీతానగరం: వ్యవసాయ గణన చేసే విధానంపై సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీర్వోలకు శిక్షణ ఇచ్చారు. ఏఎస్‌వో డాక్టర్ జి.చిన్నమ నాయుడు ఆధ్వర్యంలో తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. చిన్నమ నాయుడు మాట్లాడుతూ 2022 – 23 ఆధారంగా మొదటి విడత గణన పూర్తయ్యిందని, రెండో విడత వ్యవసాయ గణన చేయాల్సి ఉందన్నారు. రెండు గ్రామాలను ఎంపిక చేస్తారని, వాటిలో సమగ్ర గణన నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా వారాహి అమ్మవారి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వారాహి అమ్మవారు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వర స్వామి పీఠంలో వారాహి అమ్మవారి గుప్త నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీఠంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఉత్సవాలు ఈ నెల 18వ తేదీతో ముగుస్తాయి. ఆ రోజు ఉదయం అమ్మవారికి చందనాభిషేకం నిర్వహిస్తారు.

ముగిసిన వారాహి నవరాత్రులు



వారాహి అమ్మవారు

బిక్కవోలు: కొంకుదురులో వారాహి నవరాత్రులు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో కలశ స్థాపన చేశారు. తొమ్మిది రోజులుగా మహిళ బృందం సభ్యులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం లలితా సహస్రనామం, శ్రీదేవి ఖడ్గమాల, వారాహి స్తుతి, చండిక స్తుతులను పారాయణ చేశారు. ఈ కార్యక్రమంలోని లక్ష్మీనారాయణ శర్మ పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రంగంపేట: చంద్రేడు గ్రామంలోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ స్వామివారికి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో పది రోజులుగా మూసివేసిన దుకాణాలను అప్పుడే తెరవద్దని తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు ఆదేశించారు. గ్రామంలో డయేరియా ప్రబలడంతో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మాంసం, చేపలు దుకాణాలు, స్వీట్ షాపులు, హోటళ్లు, జంక్ ఫుడ్ దుకాణాలను కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మూసివేశామన్నారు. కలెక్టర్ ఆదేశాలు వచ్చిన తర్వాత దుకాణాలు ఎప్పుడు తెరవాలో తెలియజేస్తామన్నారు. ఆదేశాలను అతిక్రమించిన దుకాణాల యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈసారీ నిరాశేనా!

- నిరుద్యోగ భృతి ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- విధివిధానాలపై స్పష్టత కరువు
- నిరుద్యోగుల ఎదురుచూపులు



పెదపూడి: గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి కోసం నిరుద్యోగ యువతీ, యువకులు ఎదురు చూస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ పథకం ఊసెత్తకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అసలు అమలు చేస్తారా, ఎప్పుడు చేస్తారు, విధివిధానాలు ఏమిటి అనే చర్చ సర్వత్రా జరుగుతోంది. 2014లో అధికారంలోకి వచ్చిన సమయంలోనూ చంద్రబాబు ఈ హామీని సక్రమంగా అమలు చేయలేదు. దీంతో ఈ సారి పరిస్థితి ఏమిటోనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గతంలో మొండిచెయ్యి

2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు ఈ హామీని సక్రమంగా అమలు చేయలేదు. 2014 నుంచి 2019 వరకూ నిరుద్యోగులకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మొండిచెయ్యి చూపించారు. అప్పుడు నిరుద్యోగ భృతికి 22 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వారు అర్హులన్నారు. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షలకు సిద్ధపడే నిరుద్యోగులకు ఆయా కేటగిరీల రిజర్వేషన్ ప్రకారం నిర్ణీత వయసు 42 నుంచి 47 ఏళ్ల ఉంటుంది. దీంతో వారందరూ నిరుద్యోగులైన భృతికి అనర్హులుగా మిగిలిపోయారు. ఇప్పుడు నిబంధనలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలో..

అనపర్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు సుమారు 77,175 ఇళ్లు ఉన్నాయి. ఇంటికి కనీసం ఒక్కరిని లెక్కించినా దాదాపు అదే సంఖ్యలో నిరుద్యోగులు ఉంటారు. అలాగే రాజానగరం నియోజకవర్గంలో సుమారు 42,883 ఇళ్లలో సుమారు 2,57,308 మంది నివాసం ఉంటున్నారు. వీరిలో పదో తరగతి, ఆపై చదువుకుని సరైన ఉపాధి లేక, ఉద్యోగాలు దొరకక అవస్థలు పడుతున్నవారు 46,300 మంది వరకు ఉన్నారు. వీరందరూ నిరుద్యోగభృతికి అర్హులే.

నిరుద్యోగుల అవస్థలు

ప్రస్తుతం నిరుద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉద్యోగాలు సాధించాలని పట్టుదలతో చదువుకుంటున్నారు. అయితే వారిని ఆర్థిక ఇబ్బందులు వేధిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందిస్తే తమ కష్టాలు కొంత వరకైనా తీరతాయని భావిస్తున్నారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంకా దాని ఊసే ఎత్తకపోవడం అయోమయానికి గురవుతున్నారు.

వయో పరిమితిని పెంచాలి

రాష్ట్రంలో ఏపీపీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షలకు ఓపెన్ కేటగిరీలో దరఖాస్తు చేసేందుకు అభ్యర్థులకు 42 ఏళ్ల వరకూ వయోపరిమితి ఉంది. రిజర్వేషన్ల సదుపాయం ఉన్న వారికి మరో ఐదేళ్ల సడలింపు లభిస్తుంది. అయితే చంద్రబాబు 2014 ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చాక నిరుద్యోగభృతికి 22 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న వారే అర్హులుగా పరిగణించారు. ఈ సారి అలా కాకుండా ఓపెన్ కేటగిరీలోని వారికి 42, రిజర్వేషన్ పరిధిలోని వారికి 47 ఏళ్ల వరకూ ఇవ్వాలని కోరుతున్నారు.

స్పష్టత కరువు



ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి రూ.3 వేలు ఇస్తామంటూ గత ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత దాని గురించి మాట్లాడడం లేదు. ఈ నేపథ్యంలో నిరుద్యోగ భృతి ఎప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలంటూ నిరుద్యోగులు కోరుతున్నారు. దానిపై ప్రభుత్వం వెంటనే కసరత్తు ప్రారంభించాలి.

– డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, అనపర్తి నియోజకవర్గం

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగభృతిపై తక్షణమే ప్రభుత్వం స్పందించాలి. గతంలో మాదిరిగా మాయ చేయకుండా నిరుద్యోగులందరికీ నెలకు రూ.మూడు వేలు భృతిని అందించాలి. అలాగే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలి. ఎప్పుడు ఏ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తారో వెల్లడించాలి.

– దూలం పెద్ద, రాజానగరం

తప్పకుండా ఇవ్వాలి



ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి తప్పనిసరిగా ఇవ్వాలి. అలాగే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి. దాని విధివిధానాలను వెంటనే ప్రకటించాలి. వయోపరిమితిని కూడా పెంచితేనే పలువురికి ఉపయోగంగా ఉంటుంది. ఈ పథకానికి విధివిధానాలు రూపొందించి వెంటనే ప్రకటించాలి.

– ఎస్ శివ, సీతానగరం

22 నుంచి యోగా టీచర్ శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: గౌతమి ఘాట్‌లోని సత్య సాయి ధ్యానమండలిలో ఈ నెల 22 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకూ 25 రోజుల పాటు అసిస్టెంట్ యోగా టీచర్ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని జిల్లా పతంజలి యోగా సమితి అధ్యక్షుడు, యోగా గురువు కేఎస్‌వీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. జిల్లా పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఉదయం 5.30 నుంచి ఏడు గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. ట్రెనింగ్ పూర్తి చేసుకున్న వారికి పతంజలి యోగ్పీఠ్ హరిద్వార్ నుంచి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. యోగా ద్వారా ఉపాధి పొందాలనుకునే వారికి ఇది చక్కటి అవకాశమన్నారు. 22వ తేదీన జరిగే ప్రారంభ కార్యక్రమానికి హరిద్వార్ పతంజలి యోగ్పీఠ్ నుంచి స్వామి రాందేవ్ బాబా ప్రధాన శిష్యుడు స్వామి రితిదేవ్ హాజరవుతారన్నారు. శిక్షణలో మహిళా పతంజలి అధ్యక్షురాలు వేణి, ఉపాధ్యక్షురాలు కర్రి సత్య లలిత రెడ్డి పాల్గొంటారన్నారు. ఆసక్తి కలవారు 73960 03444 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక కౌంటర్లలో టమాటా విక్రయాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బహిరంగ మార్కెట్‌లో టమాటా ధరలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రజలకు అందుబాటు ధరలో అందజేయనున్నట్టు జిల్లా ట్రేడింగ్ అండ్ మార్కెటింగ్ శాఖ ఎం.సునీల్ వినయ్ తెలిపారు. రైతుబజార్ల విక్రయించే ధరకే నగరంలోని ఐదు ప్రదేశాలలో అవుట్ లెట్లు ఏర్పాటు చేసి అమ్మకాలు జరుపుతామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు మంగళవారం నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు తెలిపారు. మల్లయ్యపేట, ఏవీ అప్పారావు రోడ్డు, ప్రకాశం నగర్, స్టేడియం రోడ్డు, బొమ్మూరులోని ప్రధాన సెంటర్లలో అవుట్ లెట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి టమాటాలు విక్రయిస్తామన్నారు.

ఆర్యాపురం బ్యాంకును రక్షించుకోవాలి



కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు

- నందెపు శ్రీనివాస్ ప్యానల్‌ను గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపు

రాజమహేంద్రవరం సిటీ: ఆర్థిక పరమైన వివిధ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకును రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం తుమ్మలావ సాయిబాబా ఆలయం దగ్గర ది.ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖులలో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించిన నాయకులను కాపాడుకోవాలని అన్నారు. రాజమహేంద్రవరంతో పాటు పరిసర ప్రాంతాలలో ఉన్న అర్బన్ బ్యాంక్ ఖాతాదారులు, నగర ప్రముఖులు బలపరిచిన ప్యానెల్‌కు ఓట్లు వేసి ఆర్యాపురం అర్బన్ బ్యాంక్‌ను రక్షించుకోవాలని సూచించారు. నగర ప్రముఖులు బలపరిచిన ప్యానెల్ చైర్మన్‌గా నందెపు శ్రీనివాస్, డైరెక్టర్లుగా నందూరి సుబ్బారావు, ఆకుల శ్రీనివాస్, కస్సే రాజేష్, డాక్టర్ లంక సత్యనారాయణ, నందం కుమార్ రాజా, పెద్దిరెడ్ల శ్రీనివాస్, పెంకే సురేష్ కుమార్, దూడల వీర వెంకట త్రినాథ్, కుంద్రావు రాంబాబు పోటీ చేస్తున్నారన్నారు. ఈ ప్యానెల్ మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మేడపాటి షర్మిలా రెడ్డి, చందన నాగేశ్వర్, బొమ్మన జయ కుమార్ బలపరుస్తున్నారన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవ్వరైనా లింగ నిర్ధారణ పరీక్ష వివరాలు కోరినా, చేసినా శిక్షార్హులన్నారు. కలెక్టర్ చాంబర్‌లో సోమవారం సాయంత్రం గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ (పీసీపీఎన్‌డీటీ యాక్ట్) చట్టం అమలుపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేసేలా నిఘా వ్యవస్థను పెంచాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ఆధారాలు లభ్యమైతే సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన కేసులు నమోదు చేయడంతో పాటు స్కానింగ్ సెంటర్ లైసెన్స్‌ను రద్దు చేయాలన్నారు. అలాగే అపరాధ రుసుం కూడా విధించాలని ఆదేశించారు. నూతనంగా ప్రైవేట్ అనుమతిలో స్కానింగ్ సెంటర్ అనుమతి కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, ఆ స్కానింగ్ యూనిట్‌ను తనిఖీ చేసిన తర్వాతే అనుమతి ఇవ్వాలని డీఎంఅండ్‌హెచ్‌వోను ఆదేశించారు. జిల్లాలో లింగ నిష్పత్తి సంఖ్య 800 కంటే తక్కువగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది జరిగిన ప్రసవాలు (డెలివరీ) లింగ నిష్పత్తి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ ఏడాది సరోగసీ (అద్దె గర్భం) కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మెడికల్ బోర్డు నుంచి అనుమతి పొందిన తదుపరి మాత్రమే పరిశీలన చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎన్‌వీ పద్మశ్రీ, డీఐఓ డాక్టర్ ఎన్.రాజకుమారి, దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం

ప్రకాశం నగర్: పిల్లలు చిన్నప్పటి నుంచి చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత క్రీడా భారతి సంయుక్త కార్యదర్శి మధు మాయినాథ్ అన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన సోమవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి క్రీడలలో రాణించేలా చేసి, మంచి క్రీడాకారులను తయారుచేసుకోవాలన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్ర క్రీడా సంఘాలు, జిల్లా క్రీడా సంఘాలు సంయుక్తంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు ఎస్.అనిల్ కుమార్‌ను జిల్లా క్రీడా భారతి అధ్యక్షుడిగా, సీహెచ్ వెంకటేశ్వరరావును ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అనంతరం మధు మాయినాథ్ ని ఘనంగా సత్కరించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాజమహేంద్రవరం రూరల్: వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న కారణంగా గ్రామంలో పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పిడింగొయ్యి పంచాయతీ కార్యదర్శి ఎం.రూప్‌చంద్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆమె సోమవారం ఉదయం పిడింగొయ్యి పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పారిశుధ్య రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా డ్రై డే నిర్వహించి, అన్ని మంచినీటి ట్యాంకులను శుభ్రపరచడం జరిగిందన్నారు. పంచాయతీ పన్నుల వసూలును వేగవంతం చేయాలన్నారు. సిక్ ఇండస్ట్రీస్‌కి చెందిన బకాయిలు సుమారు రూ. 85 లక్షలు ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శి వివరించారు.

• బొమ్మూరులో బుల్‌ఫైట్



పోట్లాడుకుంటున్న ఎద్దులు

బొమ్మూరు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో సోమవారం ఉదయం రెండు ఎద్దులు పోట్లాడుకున్నాయి. దీంతో అక్కడున్న ప్రజలు పరుగులు తీశారు. ఐదు నిమిషాలు జరిగిన ఈ పోరు బుల్‌ఫైట్‌ను తలపించింది. అనంతరం స్థానికులు బెదరగొట్టడంతో అవి అక్కడ నుంచి వెళ్లిపోయాయి.

– రాజమహేంద్రవరం రూరల్.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కంబాలచెరువు: స్థానిక లాలాచెరువు ఉన్నత పాఠశాలలో 1998 – 99లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పలువురికి ఆదర్శంగా నిలిచారు. తాము చదువుకున్న పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బహుమతులు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. వీరందరూ కలిసి బృందంగా ఏర్పడ్డారు. ఇందులో భాగంగా 2023–24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులు జయ నాగదుర్గాదేవి, షెకీనా గ్లోరి, స్నైలీలకు పాఠశాలలో సోమవారం ఉదయం అసెంబ్లీ సమయంలో ఒక్కొక్కరికీ రూ.ఐదు వేలు చొప్పున అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎ.మల్లేశ్వరరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి జి.రవికృష్ణ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఇదే విధంగా నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వి.శ్రీనివాస్, కె.రాజీ, విజయలక్ష్మి, రత్నమాల, మల్లిపూడి శివాజీ పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సోషల్ మీడియాలో వేధిస్తున్న వ్యక్తులపై స్థానిక ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. పోస్టల్ కాలనీకి చెందిన తరాల శ్రీనివాస్ యాదవ్ కుమార్తె నీట్ కోచింగ్ నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటోంది. ఆమె సెల్ నంబర్‌కు మార్చి 20న ఒక ఫోన్ నంబర్‌తో వాట్సాప్ సందేశం వచ్చింది. అందులో ఆమె తండ్రిపై అవమానకరంగా తయారు చేసిన పాంప్లెట్‌కి సంబంధించిన ఫొటో ఉంది. తర్వాత ఆమెకు అదే నంబర్ నుంచి ఫోన్ కాల్ రా వడంతో ఆందోళనగురై విషయం తండ్రికి తెలియజేసింది. తనపై అసభ్యకరంగా ప్లాంపెట్ తయారు చేసి గుత్తుల మురళీకృష్ణ, కానిస్టేబుల్ ఉదయ్‌భాస్కర్‌లు తనపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారానికి పాల్పడుతున్నట్లు శ్రీనివాస్ యాదవ్ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో తెలిపాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

బాలుడి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక మోచీవీధికి చెందిన బాలుడు (9) అదృశ్యమైన సంఘటపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. తన కుమారుడు ఉదయం నుంచి కనిపించడం లేదని తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సెక్యూరిటీ గార్డు..

జీఎస్‌ఎల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఎన్.నాగభూషణం (58) అదృశ్యమైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తన భర్త కనిపించడం లేదంటూ అతడి భార్య అరుణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రాయితో వ్యక్తిపై దాడి

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న గెద్దాడ రాజశేఖర్‌ను అదే ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న రమేష్ రాయితో కొట్టాడు. వారికి గల పాత గొడవల నేపథ్యంలో ఈ ఘటన జరిగింది. దీంతో రాజశేఖర్ తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అభివృద్ధి పనులపై సమీక్ష

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఆశాజ్యోతి తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ మండల స్థాయిలో జరిగే సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి రెండు వినతులు

రంగంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రెండు వినతులు అందినట్టు తహసీల్దార్ లతీఫ్‌పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాపురంలో పాఠశాలకు చెందిన భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, జి. దొంతమూరులో 20 సెంట్ల భూమికి సంబంధించి కుటుంబ కలహాలు జరుగుతున్నాయని రెండు వినతులు అందాయని ఆయన తెలిపారు. వీటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

18 నుంచి ఉపాధి గ్రామ సభలు

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 18 నుంచి గ్రామాల వారీగా సోషల్ ఆడిట్ నిర్వహించనున్నామని ఏపీఓ ఎంపీ రామారావు తెలిపారు. 18న తోకాడ, మల్లంపూడి, భూపాలపట్నం, 19న సీతారామపురం, కొత్తతుంగపాడు, కొండగుంటూరు, 20న సంపత్‌నగరం, కలవచర్ల, నరేంద్రపురం, లాలాచెరువు, 21న చక్రద్వారబంధం, 22న పల్లిపేట, పాతతుంగపాడు, నామవరం, వెలుగుబంద, తూర్పుగానుగూడెం, 23న ముక్కినాడ, దివాన్ చెరువు, 24న రాధేయపాలెం, కానవరం, 25న రామస్వామిపేట, నందరాడ, పుణ్యక్షేత్రం, శ్రీకృష్ణపట్నం, జి.యర్రంపాలెం, పల్ల కడియం, పాలచర్ల, రాజానగరంలలో సోషల్ ఆడిట్ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే గ్రామసభలకు ఆయా గ్రామాలలోని ప్రజాప్రతినిధులు, పెద్దలు తప్పక హాజరుకావాలన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రామచంద్రరావు

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. సుమారు 450 మంది విద్యార్థులకు ప్రిన్సిపల్ శారద, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రామచంద్రరావు వీటిని అందజేశారు. అనంతరం ప్రిన్సిపల్ శారద విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో కాలేజీ 80 శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్‌కు సంబంధించి కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, అకౌంట్ ట్యాక్సేషనల్ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు.

తాగునీటిని క్లోరినైజేషన్ చేయాలి

సీతానగరం: మండలంలో పంచాయతీలు సరఫరా చేసే తాగునీటిని తప్పకుండా క్లోరినైజేషన్ చేయాలని ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.అవినాష్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి 15 రోజులకు ఒకసారివాటర్ ట్యాంకులను శుభ్రపర్చాలన్నారు. పైపులైన్లకు లీకేజీలు ఏర్పడినా, నీరు నిలిచిఉన్నా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఫీల్డ్ ట్రైనింగ్ కిట్స్ ద్వారా వాటర్ శాంపిళ్లను పరీక్షించాలన్నారు. ఏ మాత్రం అనుమానం ఉన్నా రాజమహేంద్రవరంలోని ల్యాబ్‌కు తీసుకువెళ్లి టెస్ట్ చేయించాలన్నారు. గ్రామాల్లో డయేరియా లక్షణాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి

బిక్కవోలు: మండలంలోని ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బిక్కవోలు కేపీఆర్ ఫ్యాక్టరీలో రేకు షెడ్డు పని నిమిత్తం కాకినాడ చెందిన బత్తిన దుర్గాప్రసాద్(40) వచ్చాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడిపోవడంతో గ్రాయాలై మృతి చెందినట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

పేదలకు ఆహార ప్యాకెట్ల అందజేత

పెదపూడి: సమాజంలో పేదలు, వృద్ధులను ఆదుకోడానికి దాతృత్వం కలిగిన దాతలు ముందుకు రావాలని హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ పుంద్రు సత్యనారాయణ అన్నారు. కరకుదురులో వేద వ్యాస రుషి పీఠంలో వంద మంది పేదలు, వృద్ధులకు ఆహార ప్యాకెట్లు సోమవారం పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా నేత దివంగత పుంద్రు దొరబాబు నాలుగో వర్ధంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దొరబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పుంద్రు మనోజ్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి వాసంశెట్టి మాధవ పాల్గొన్నారు.

18న బంగారు ఆభరణాలకు వేలం

కంబాలచెరువు: స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కొంతకాలంగా సరైన ధ్రువపత్రాలు, యజమాని వివరాలు తెలియని బంగారు ఆభరణాలకు వేలం వేస్తున్నట్టు టూటౌన్ పోలీసులు సోమవారం తెలిపారు. రెండు బంగారు నెక్లెస్‌లు, చైన్, చెవిదిద్దులు, ఉంగరానికి ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు ఎమ్మార్వో కార్యాలయంలో వేలం వేయనున్నారు.